www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025
5
కాకినాడ



కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం కోరారు. పిఠాపురంలో పర్యటించిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ కళాశాల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయడం లేదన్నారు. గత ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కావున కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునేలా తమ సమస్య డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

నేడే ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్

- సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రారంభం
- మొత్తం ఎనిమిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- తొలి ప్రాధాన్యతా ఓటులో 24 గంటల్లో ఫలితం


ఏలూరులో కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ సోమవారం జరగనుంది. ఈ ప్రక్రియకు ఏలూరు సిఆర్ రెడ్డి కాలేజీ వేదిక కానుంది. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ ప్రక్రియను చేపట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగిన విషయం విదితమే. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్సులన్నీ సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చారు. కౌంటింగ్ రోజు ఉదయం ఏడుగంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములు తెరిచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలులోకి చేర్చనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉండగా, రెండు జిల్లాల్లో 456 కేంద్రాల్లో 2,18,902 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ కొంచెం భిన్నంగా ఉంటుంది. ప్రాధాన్యతా అంకెల ఓట్ల ఆధారంగా ఓట్ల లెక్కింపు జరగనుంది. ముందుగా బ్యాలెట్లను కట్టలుగా కడతారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకూ కట్టలు కట్టే ప్రక్రియ సాగే అవకాశం ఉందని చెబుతున్నారు. సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపునకు మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు. టేబుల్‌కు వెయ్యి ఓట్లు చొప్పున ప్రతి రౌండ్లోనూ 28 వేల ఓట్ల వరకూ లెక్కించనున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగనుంది. ఇంకా ముందుగా ఫలితం వెల్లడించేందుకు కౌంటింగ్ ప్రక్రియలో మార్పులు, చేర్పులు చేపట్టే అవకాశాలను అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు ఒక్క రోజులో పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో షిఫ్టుల వారీగా పని చేసేందుకు మొత్తం 700 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. టేబుల్‌కు ఒక్కరు చొప్పున అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉంది. ఓట్ల లెక్కింపు రోజు భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా పోలైన ఓట్లలో చెల్లుబాటు ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. చెల్లుబాటు అయిన ఓట్లలో మొదటి ప్రాధాన్యతతో వేసిన ఓట్లు సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. మొత్తం 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు లక్షల ఓట్లు చెల్లుబాటు ఓట్లుగా పరిగణిస్తే విజేతగా ప్రకటించే అభ్యర్థికి లక్షా ఒక ఓటు రావాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఏ అభ్యర్థి ఈ మార్కును చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపడినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకూ మిగతా ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యతా ఓట్లు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థుల మొదటి ప్రాధాన్యతా ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా ప్రతి అభ్యర్థికీ రెండో ప్రాధాన్యతా ఓటు ఎవరికి వేశారనేది లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తారు. ఇలా కింద నుంచి పైవరకూ ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను వారికి కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళతారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లలోనూ మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థీ చేరుకోకపోతే తృతీయ ప్రాధాన్యతా ఓట్లను గణించి ఆ అభ్యర్థులకు జమ చేస్తారు. ఎలిమినేషన్ రౌండ్ జరిగితే మొదటి ప్రాధాన్యతా ఓటుతోపాటు ఇతర ప్రాధాన్యతా ఓట్లు సైతం చాలా కీలకంగా మారనున్నాయి. ఎలిమినేషన్ రౌండ్‌కు ఓట్ల లెక్కింపు వెళ్తే ఫలితం రావడానికి రెండు రోజుల వరకూ పట్టే అవకాశం ఉంది.


ఏలూరులో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆ జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు నష్టం చేకూర్చే హిట్ అండ్ రన్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జరిమానాల పేరుతో రవాణా రంగ కార్మికులపై ప్రభుత్వం వేస్తున్న భారాలను రద్దు చేయాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు ప్రభుత్వం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇప్పటివరకు లైసెన్సులు జారీ చేసే పనిని ఆర్‌టిఒ అధికారులు చేపట్టే వారని, అయితే ఆ పనిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమని, తక్షణమే లైసెన్సుల జారిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాహనాల ఫిట్నెస్ చెకింగ్ కూడా ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం సరైంది కాదన్నారు. సమస్యలపై జరిగిన సన్నాహక సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులందరూ భారీ స్థాయిలో మరొక సమావేశాన్ని ఈనెల 18వ తేదీన ఏర్పాటు చేసుకుని ఆ సమావేశం అనంతరం పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. 18వ తేదీన జరిగే సమావేశానికి నగరంలో ఉన్న అన్ని రకాల ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల సమస్యలపై ఈనెల 24వ తేదీన పార్లమెంటు వద్ద ఆందోళన జరుగుతుందని, ఈ ఆందోళనకు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని, ఆ ఆందోళనకు మద్దతుగా 24వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన దీక్షలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టాటా మ్యాజిక్ యూనియన్ నగర అధ్యక్షులు వాలిశెట్టి శ్రీను, సత్యనారాయణ, గూడ్స్ వాహనాల యూనియన్ నాయకులు నాగరాజు, సూరిబాబు, ప్రకాష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు సాగునీరు అందించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు


పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ఎండిపోతున్న పంట పొలాలకు తక్షణమే పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం మండలంలోని పత్తిగొందిలో సాగునీరు అందక ఎండిపోయిన పంటపొలాలను ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది దాల్వాల్లో వస్తున్న నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. శివారు పొలాలకు, మెరక భూములకు గత 10 రోజులుగా సాగునీరు లేక పత్తిగొంది కాలువపై సుమారు 100 ఎకరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎరువులు జల్లడానికి సైతం పొలాల్లో సాగునీరు లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతులు సాగునీరును కాలువల్లోంచి తోడుకునేందుకు అవసరమైన డీజిల్ ఖర్చును ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ధవలేశ్వరం ఆనకట్ట వద్ద పూడిక తీసి సాగునీటిని నిల్వ చేసి రైతాంగానికి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కౌలు రైతులు నాగరాజు, పలివెల కొండ, వెంకన్నబాబు, రామకృష్ణ, సత్యనారాయణ లోవరాజు, జడ్డు గోపి, మేడిశెట్టి శ్రీను, విఘ్నేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



కుక్క దాడిలో గాయపడిన బాలుడు

ఏలేశ్వరంలో ఆదివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి 17 మందిని గాయపరిచింది. 5 వార్డు మందులపేట,6 వార్డ్ పెద్దవీధి, 8వ వార్డు తోటవీధి, ఒకటో వార్డులోని ఆర్‌టిసి కాలనీ, 2, 3 వార్డులు షిరిడి నగర్ ప్రాంతాల్లో పిచ్చికుక్క కదలికలు గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి సూపర్‌టెం డెంట్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ కుక్క కాటుకు గురైన వారికి వైద్య సేవలు అందించామని అన్నారు. తీవ్ర గాయాలైన కార్తికేయ (10), జాన్(2) లను మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో కుక్కలు విచ్చలవిడిగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

కాలుష్యాన్ని ప్రోత్సహించిన వారిపై చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ



మీడియాతో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

కుంభమేళా పేరుతో గంగా నదిలో కాలుష్యాన్ని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మతపరమైన మిధ్య కల్పన వల్ల తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో పెట్టుకోవద్దని, మత విశ్వాస పేరుతో మోసపోవద్దని సూచించారు. కుంభమేళాలో కోట్లాదిమంది స్నానాలు చేయటం వల్ల అక్కడ మల మూత్రాలు పెరిగిపోయి గంగానది నీటి నాణ్యత తీవ్రంగా పడిపోయిందన్నారు. నీటిలో కోలీఫామ్ బ్యాక్టీరియా ఉందని అవి స్నానం చేయడానికి, తాగడానికి పనికిరావని గుర్తుంచుకోవాలన్నారు. నిపుణులు ఇచ్చిన సూచనలకు విరుద్ధంగా యుపి సిఎం యోగి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటనలు ఇచ్చారని, వారిపై చర్యలు తీసుకోవాలని సుబ్బయ్య డిమాండ్ చేశారు. గతంలో గంగా నదిని నాశనం చేసిన పండిట్ రవిశంకర్‌కు పర్యావరణ పరిరక్షణ సంస్థ రూ.100 కోట్ల జరిమానా విధించిందని, కానీ ఇప్పటికీ ఆ జరిమానా చెల్లించలేదన్నారు. ప్రస్తుతం జరిగిన గంగా నదికి కుంభమేళాలో 60 కోట్ల మంది స్నానం చేయడం వల్ల ఆ నీళ్లు కలుషితమయ్యాయని, దీనికి ఎన్నిరెట్లు పరిహారం విధించాలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రకటించాలని కోరారు. ప్రజల్లో మత రహిత వాదనను పెంచాలని, దానికి పాలకులు మతాన్ని వినియోగించకూడదన్నారు. శాస్త్రీయంగా ఆలోచించే సమాజాన్ని నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని హితవు పలికారు. దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్రీయ విధానాన్ని పాలకులు అనుసరించి ప్రజల్లో విజ్ఞానం పెంచాలని సుబ్బయ్య సూచించారు. ఈ సమావేశంలో భారత హేతువాద సంఘం సభ్యులు గ్రంధి నాగేశ్వరరావు, పసుపులేటి దుర్గారావు పాల్గొన్నారు.

రాంబాబు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం


రాంబాబు దంపతులను అభినందిస్తున్న నాగార్జున

సమాచార శాఖలో 32 సంవత్సరాల పాటు ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా సేవలందించిన సిహెచ్. రాంబాబు సేవలు అభినంద నీయమని సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున అన్నారు. పదవీ విరమణ చేసిన రాంబాబుకు అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో విజువల్ సూపర్ వైజర్‌గా పెద్దాపురం, కాకినాడ, ఏలూరు కేంద్రాల్లో 32 సంవత్సరాలు సేవలందించారని గుర్తు చేశారు. పాత్రికేయుడు చల్లా విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, సి.బాబురావు, జి.ధర్మరాజు, ఎన్.సూరయ్య, ఆర్ఎస్.కుమార్, సిహెచ్.నరేష్, పాల్గొన్నారు.

ఎంపీ స్థానాల పెంపులో సమతుల్యత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియలో ఉత్తరాది-దక్షణాది రాష్ట్రాల మధ్య సమతుల్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 4 దశాబ్దాలుగా జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఎంపి సీట్ల పెంపుదలలో ప్రత్యేక నిష్పత్తి విధానం అమలు చేయాలని, ఇందుకు తగిన చట్ట సవరణలు చేపట్టాలని కోరారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాల్లో అడ్డగోలు ప్రాతిపదికగా ఎంపి సీట్ల సంఖ్య పెంచితే సమతుల్య విధానం దెబ్బతింటుందన్నారు. తద్వారా దక్షిణాది రాష్ట్రాలు హక్కులు, నిధులు కోల్పోయే పరిస్థితి ఉంటుందన్నారు. పన్నుల రూపంలో ప్రజలు కడుతున్న ప్రతి రూపాయికి దక్షిణాదిలో కేరళకు 57 పైసలు, తెలంగాణాకు 43 పైసలు, కర్నాటకకు 15 పైసలు, మహారాష్ట్రకు 8 పైసలు, తమిళనాడుకు 29 పైసలు ఆంధ్రప్రదేశ్ కు 49పైసలు లభిస్తున్నాయని అన్నారు. అదే ఉత్తరాదికి చెందిన జార్ఖండ్‌కు రూ.8.15, మధ్యప్రదేశ్‌కు రూ.2.49, బీహార్‌కు రూ.7.06, ఉత్తరప్రదేశ్‌కు రూ.2.73, అసోంకు రూ.8.63 లభిస్తున్నాయన్నారు. జనాభా విధానంలో దక్షిణాదికి అన్నివిధాల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. పునర్విభజన ప్రక్రియలో లోటు ఏర్పడకుండా సరి చేయాల్సిన పద్ధతులు పాటించాలన్నారు. రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన విభజన వైరుధ్యం కాకూడదన్నారు. దక్షిణాదిలో ఒక ఎంపి సీటు పెరిగితే ఉత్తరాదిలో 4 ఎంపీ సీట్లు పెరిగే పరిస్థితి ఉందన్నారు.

బాల్య వివాహాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


అవగాహనా ర్యాలీలో సిడిపిఒ లక్ష్మి, ఇతరులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం రమణయ్యపేటలో బాల్య వివాహాలపై అవగహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వై.లక్ష్మి మాట్లాడారు. అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని అన్నారు. నిర్ధిష్టమైన వయస్సు నిండిన తర్వాత స్త్రీలోని గర్భాశయం బిడ్డను మోయడానికి పరిపక్వత చెందుతుందని తెలిపారు. ఆ వయసులోనే బిడ్డ సంరక్షణ పట్ల ఆమె మానసికంగా సిద్ధపడుతుందన్నారు. చిన్న వయసులో వివాహం చేస్తే శిశువు సరిగా ఎదగదని గుర్తించుకోవాలన్నారు. బాల్య వివాహం చేస్తే పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు, తల్లిదనండ్రులు, వివాహానికి వచ్చిన పెద్దలు కూడా శిక్షార్హులేనని హెచ్చరించారు. కావున గ్రామాలు, పట్టణాల్లో బాల్యవివాహాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే అంగన్‌వాడీ, లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. అనంతరం బాల్య వివాహాలను అరికడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.మార్తమ్మ, పద్మశ్రీ, సింహాచలం, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త యు.రాజేశ్వరి పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మండలంలోని హుస్సేన్‌పురంలో గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పూజ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. వీరిలో సుమారు 50 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేశారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన చల్లా బుజ్జిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, పుప్పాల గిరి, యవరన అబ్బాయి, యవరన సత్తిబాబు, కిరణ్ కంటి ఆసుపత్రి ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, టెక్నిషియన్ హేమ సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



చెరువులో చేపల మృత్యువాత

ప్రజాశక్తి - జగ్గంపేట


మృత్యువాత పడిన చేపలు

మండలంలోని రామవరం ముత్యాలమ్మ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. ఎస్‌సి ఫిషరీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇరిగేషన్ చెరువు నుంచి ఆయకట్టు రైతులు పొలాలకు నీటిని వాడుకున్నారు. నీరు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం విక్రయం చేసేందుకు సొసైటీ నిర్వాహకులు శనివారం సాయంత్రం చేపలను పట్టారు. పట్టికున్న చేపలను వలలో ఉంచి నీటిలోనే వదిలిపెట్టారు. అయితే ఆదివారం తెల్లవారుజామున చెరువులో నిల్వ చేసిన చేపలను బయటకు తీయగా మొత్తం చేపలు మృతి చెందాయి. సుమారు 3 టన్నులు చేపలు మృతి చెందాయని, రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని సొసైటీ సభ్యులు వాపోయారు. చేపలు మృతి చెందడంతో మత్స్య శాఖకు చెల్లించాల్సిన పన్నును రద్దు చేయాలని వారు కోరారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు చెరువును సందర్శించారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే యాత్రికులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఆసాధులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.


విన్నర్, రన్నర్ జట్లుకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగిపేటలో ఈనెల 21 నుంచి జరుగుతున్న శంకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. విన్నర్‌గా కొబ్బరి చెట్టు పేట జట్టు నిలవగా, రన్నర్ జట్టుగా కోరంగి క్రికెట్ క్లబ్ దక్కించుకుంది. ఈ సందర్భంగా చొల్లంగి పేట సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, గంగబాబు, మాజీ సర్పంచ్ మైదు హరిబాబు విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంటు నిర్వాహణకు సహకరించిన మాజీ సర్పంచ్ మైధు హరిబాబు, మాజీ ఎంపిటిసి మందాల సత్తిబాబు, చొల్లంగి ఉపసర్పంచ్ స్వర్ణ రాజు, మట్టా లింగమూర్తి, మొండి భీమశంకర్, గంపల నాగేశ్వరరావు, శీకోటి సింహాద్రి, కర్రీ చిన్నారెడ్డి నీలపల్లి సత్తిబాబు, కారే రాజు, రామసెట్టి హరిబాబు తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కారే సత్యవతి, రాజబాబు, కంది రాము, నీలపాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు


ప్రజాశక్తి - కాకినాడ రూరల్


గర్భిణికి బహుమతిని అందిస్తున్న అనంతలక్ష్మి

రమణయ్యపేట దండు పుంతలో గిడుతూరి శ్రీను ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి పాల్గొని మాట్లాడారు. సీమంతాలు గర్భిణులకు మానసిక భరోసాను కల్పిస్తాయన్నారు. తల్లి మానసిక ఆనందం పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, కాలా శ్రీను, రాయుడు అనిల్, మాచవరపు సత్యనారాయణ, గొడవర్తి సందీప్, కాకరపల్లి ప్రతాప్, సత్యనారాయణ, భవాని పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదుకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - కాజులూరు


సమస్యను వివరిస్తున్న రైతు

భూ ఆధార్ నమోదుకు రైతులు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ కోరారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో భూ ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుమారు 13,500 మంది సొంత భూమి కలిగిన రైతులు ఉన్నారని, ఇప్పటివరకు 10 వేల మంది భూ ఆధార్ నమోదును చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు త్వరితగతిన భూ ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు స్వయంగా రైతు సేవ కేంద్రానికి వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. భూ ఆధార్ నమోదు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువలో గోపవరం వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులకు లభ్యమైంది. మృతిని వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని, గుర్తుపట్టేందుకు వీలు లేకుండా మృతదేహం కుళ్లిపోయిందని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విఆర్ఒ డి.శైలజ సమక్షంలో మృతదేహానికి పంచనామా నిర్వహించామని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన పురుషులు కనిపించకుండా ఉంటే కుటుంబీకులు ఆచూకీ కోసం ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ రాజేష్ కోరారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మద్యం తాగి ఆటో నడుపుతూ పట్టుబడ్డ వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. ఆదివారం సాయంత్రం ఎస్ఐ ఎస్.రాము ఆత్రేయపురం సెంటర్ లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. గ్రామానికి చెందిన బండి దిలీప్ మద్యం తాగి ఆటో నడుపుతూ వాహనా తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలపై దాడి.. నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని గ్రామాలలో పోలీసులు ఆదివారం కోడిపందేల శిబిరాలపై దాడులు నిర్వహించారు. అంకంపాలెం గ్రామ శివారున కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లను, రెండు కత్తులు, రూ.11 వందల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.


నెలల నిండకుండా పుట్టిన శిశువులు

వైద్య సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-కరప

నెలలు నిండకుండా పుట్టిన పిల్లకు వైద్యం చేయించడానికి ఆ పిల్లల తల్లిదండ్రులు సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కరప గ్రామానికి చెందిన విజయలక్ష్మి, సీతారామయ్య దంపతులకు ఇటీవల వివాహం అయ్యింది. విజయలక్ష్మి గర్భవతిగా ఉండగా 6వ నెలలోనే ఇద్దరు శిశువులకు జన్మనిచ్చింది. శిశువులకు అవయవాలు పూర్తిగా ఎదగనందున వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. వారి చికిత్స రోజూ రూ.వేలల్లో ఖర్చు అవుతున్నందున ఆర్థిక స్థితి సహకరించక తల్లిదండ్రులు సతమతం అవుతున్నారు. పిల్లల వైద్యానికి దాతలు మానవతా దృక్పథంతో సాయం చేయాలని వారు కోరుతున్నారు. తల్లిదండ్రులను 8309717542లో సంప్రదించవచ్చని, బ్యాంకు అకౌంట్ Sbi account no 42217087713 (Ifsc code SBIN0000996)లో నగదు జమ చేయాలని కోరుతున్నారు.

నియామకంపై హర్షం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన కామన ప్రభాకర రావును కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం పట్ల ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. రైతు కుటుంబంలో పుట్టి, రైతు సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ప్రభాకర రావును కాంగ్రెస్ పార్టీకిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎంపిక చేయడం పార్టీకి, రైతులకు శుభ పరిణామమని పేర్కొన్నారు. రైతు సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు కోరారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పాలెపు ధర్మారావు, సీనియర్ నాయకులు పెన్మత్స జగ్గప రాజు, వడ్డీ నాగేశ్వర రావు,గుబ్బల రవి,పి ఉదయ భాస్కర వర్మ,ముషిని శివ ప్రసాద్, గోడి భాస్కర రావు, కాశి అచ్యుత రామయ్య, పలువురు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రయివేటు పాఠశాలల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. శ్రీ వాగ్దేవి పాఠశాలలో అమలాపురం డివిజన్ ప్రయివేటు పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ సమావేశం ప్రస్తుత అధ్యక్షులు ముమ్మిడి ప్రతాప్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశంలో విధ్యానిధి విధ్యాసంస్థల అధినేత ఆకుల బాపన్న నాయుడు ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్య వర్గాన్ని అందరి ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నామని అన్నారు. వీరి నిర్ణయాన్ని రాష్ట్ర నాయకులు సిరిపల్లి సిద్దార్థ పాఠశాల అధినేత మట్టపర్తి సత్యనారాయణ, అమలాపురం డివిజన్ గౌరవ అధ్యక్షులు, తులిప్స్ పాఠశాల అధినేత నెల్లి రమేష్, మదర్ థెరిసా పాఠశాల అధినేత మంగళంపల్లి అంజిబాబు, అమలాపురం నెహ్రూ పాఠశాల అధినేత తోట నరసింహం ,అల్లవరం గణపతి పాఠశాల అధినేత కంకిపాటి గణపతి వివిధ మండల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

నిరామయ పథకంపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ , హరి మనో వికాస కేంద్రం వికలాంగ పాఠశాలలో ఆదివారం కేంద్ర ప్రభుత్వం నిరామయ పథకం పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల నిర్వాహకులు సల్లా బత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ పథకం తీసుకుంటే రూ లక్ష ఆరోగ్య బీమా వస్తుందని చెప్పారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం

పట్టు పరిశ్రమ అధికారి గీతారాణి





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మల్బరీ తోటల పెంపకానికి పట్టు పరిశ్రమ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని పట్టు పరిశ్రమ జిల్లా అధికారి బి.గీతారాణి అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, ఇన్‌పుట్ సబ్సిడీలు తదితర అంశాలను ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

జిల్లాలో ఎంత సాగు ఎక్కడెక్కడ జరుగుతుంది.?

జిల్లాలోని గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, బిక్కవోలు మండలాల్లో మల్బరీ తోటల సాగు జరుగుతుంది. దాదాపు 2,164 ఎకరాల్లో సుమారు 1015 మంది రైతులు వీటిని సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింతగా అవగాహన పెంచుకోవాలి. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలతో బాటు రంపచోడవరం డివిజన్లలో మల్బరీ పంట సాగు జరుగుతుంది. రాష్ట్రంలో పట్టు పరిశ్రమ సంప్రదాయ జిల్లాలయిన చిత్తూరు, శ్రీ సత్య సాయి జిల్లాల తర్వాత 2022-23 సంవత్సరం కాకినాడ జిల్లా పట్టు గుళ్ళ ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉంది.

మల్బరీ నారు మొక్కల పెంపకానికి రాయితీలు?

మల్బరీ నారు మొక్కల పెంపకానికి ఒసి, బిసి రైతులకు రూ.22,500, ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.27వేలు అందజేస్తుంది. ఇందులో ఒసి, బిసి రైతులకు కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర ప్రభుత్వం రూ.9,500 రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 అందజేస్తుంది.

పట్టుపురుగుల గది నిర్మాణానికి రాయితీలు?

రేరింగ్ షెడ్డు ఒకటో రకానికి యూనిట్ ధరలు రూ.4.50 లక్షలు వస్తుంది. ఇందులో కేంద్రం రూ.2.25 లక్షలు, రాష్ట్రం రూ. 1,12,500, రైతు వాటాగా రూ, 1,12,500, రెండవ రకం షెడ్డుకి రూ.3.25 లక్షలు యూనిట్ ధర అయితే ఇందులో కేంద్రం రూ.1,62,500, రాష్ట్రం రూ.81,250, రైతు వాటాగా రూ.81,250 ఇవ్వాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఒకటవ రకం యూనిట్ ధర రూ.4.50 లక్షలు అయితే ఇందులో కేంద్రం రూ. 2,92,500, రాష్ట్రం రూ.1,12,500, రైతు వాటా రూ.45 వేలు ఉంటుంది. ఒకటవ రకం యూనిట్ ధర రూ.3.25 లక్షలు అయితే ఇందులో కేంద్రం రూ. 2,11,500, రాష్ట్రం రూ.81,250, రైతు వాటా రూ.32,500 ఉంటుంది.

రేరింగ్ పరికరాల ఏర్పాటుకు వచ్చే రాయితీలు ?

ఒకటవ రకం యూనిట్‌కు ప్రభుత్వం రూ.75 వేలు మంజూరు చేస్తుంది. ఇందులో రూ.56,250 రాయితీగా వస్తుంది. అలాగే రెండవ రకానికి రూ.50 వేలు మంజూరు చేస్తుండగా ఇందులో రూ.37,500 రాయితీగా వస్తుంది. బై వాలెంటైన్ పట్టుగూళ్ల ఉత్పత్తిదారులకు కేజీ పట్టుగూళ్ళకు రూ. 50 చొప్పున ప్రోత్సాహక రాయితీ అందిస్తున్నాము. ఈ ఏడాదిలో రూ.9 లక్షలు ప్రోత్సాహక రాయితీ అందించాం. అలాగే ప్రయివేటు విభాగంలో ముడి పట్టు దారం ఉత్పత్తిదారులకు ఒక కేజీ పట్టు దారానికి రూ.130 చొప్పున ప్రోత్సాహక రాయితీ అందిస్తున్నాము. ఆర్‌కెవివై పథకం ద్వారా రేరింగ్ షెడ్లకు, వరండాల ఏర్పాటుకు రూ.30 వేలు సబ్సిడీ అందిస్తున్నాం. రెండు ఎకరాల్లో మల్బరీ తోటలు నాటినందుకు ఏడాదికి చిన్న, సన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.63 వేలు లబ్ధి చేకూర్చడమే కాకుండా రేరింగ్ షెడ్ నిర్మాణానికి ఒకటో రకానికి రూ.3 లక్షల 15 వేలు, రెండో రకం షెడ్ కు రూ.3 లక్షల 11 వేలు లబ్ధి చేకూరుతోంది.

'ఉపాధి' హామీ నిధులతో ప్రయోజనాలు ఏమైనా ఉన్నాయా.?

పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు కేటాయిస్తోంది. తద్వారా జిల్లాలోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది. గరిష్టంగా 5 ఎకరాల్లో ఎకరాకు రూ.18,750 సబ్సిడీ వస్తుంది. ఉపాధి హామీ పథకంలో మల్బరీ తోటలు పెంపకంలో భాగంగా సబ్సీడీలను అందిస్తుంది. 2 ఎకరాలు ఉన్న రైతుకు ఈ మొత్తాన్ని మూడేళ్ళ పాటు ఇస్తారు. సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే ఈ రాయితీ ఇస్తున్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పాఠంశెట్టి సూర్యచంద్ర

హామీలు అమలు ఎప్పుడు..?

ప్రజాశక్తి - కిర్లంపూడి

జగ్గంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా జగ్గంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పాఠంశెట్టి సూర్యచంద్ర ప్రశ్నించారు. ఆదివారం తన స్వగ్రామం బూరుగుపూడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏలేరు ఆధునికరణ, మల్లవరం ఎత్తిపోతల పథకం నిర్మాణం, తాళ్లూరు లిఫ్ట్ పునర్ని నిర్మాణం, కిర్లంపూడి, గోకవరంలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు వంటి హామీలు గత 9 నెలల కాలంలో ఏమి చేశారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు ఈ నెల 28న ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు పొంతన లేదన్నారు. కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను దృష్టిలో పెట్టుకునే ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని, అయితే ఈ బడ్జెట్‌లో ఆ హామీల ఊసే లేకుండా ప్రజలను ప్రజలను మోసం చేశారని అన్నారు. ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ తక్షణం స్పందించి పుష్కర ఎత్తిపోతల పథకం పున్ణ నిర్మాణం చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తానని ఆయన హెచ్చరించారు.



స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

ఆదిత్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవ

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఆదివారం నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా కళాశాల పరిసర ప్రాంతాలు, పబ్లిక్ పార్క్‌ను శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పొడి చెత్తను సేకరించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ ఎస్.నరసింహారావు పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో ఆదిత్య విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్. నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విజయానికి వయసుతో పని లేదు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టుదల, శారీరక దృఢత్వానికి నైపుణ్యం తోడైతే విజయానికి వయసుతో పని లేదని మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు అన్నారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడలో 70 ప్లస్ విభాగంలో విన్నర్స్‌గా, 60 ప్లస్ విభాగంలో రన్నర్స్‌గా విజయం సాధించిన సీనియర్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు, సెవెన్ హిల్స్ పేపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పసల పద్మ రాఘవరావుకు లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం అభినందన సత్కారం జరిగింది. జడ్‌పి ఎంపిహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 70 వసంతాలు పైబడినా పూర్తి ఆరోగ్యంతో జాతీయ, అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొని విజయం సాధించడం అభినందనీయమన్నారు. వందేళ్ళ వయసు వరకు ఇదే ఆరోగ్యంతో క్రీడల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పద్మ రాఘవరావు మాట్లాడుతూ తన అన్ని విజయాలకు తన స్నేహితులైన రాజా సూరిబాబు రాజు సహకారమేనని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పసల సత్యనందరావు, ఎంద్రు ప్రభాకర్ రావు, కొప్పిరెడ్డి సత్యనారాయణ, గంధం రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



పద్మ రాఘవరావును సత్కరిస్తున్న అభిమానులు


మల్లాడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చినబొడ్డ వెంకటయ్యపాలెంలో విజయ కనకదుర్గాదేవి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్ఎలు దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు మాజీ ఎంపిటిసి వైదాడి శ్రీనివాస్, వాడ్రేవు వీరబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మందాల గంగ సూర్యనారాయణ, కట్ట త్రిమూర్తులు, ఉంగరాల బూరిబాబు, పెమ్మాడి కష్ణవేణి, ధూళిపూడి బాబీ, టేకుమూడి సత్యనారాయణ, సోమరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - కిర్లంపూడి

1982-83 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 43 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. రాజుపాలెం గ్రామానికి చెందిన ఎ-1 కాంట్రాక్టర్ గణేశుల రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో గణేశుల లక్ష్మణరావు బ్రదర్స్ బంధువుల పర్యవేక్షణలో 43 ఏళ్ల తరువాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మే ళనంలో పాల్గొన్నారు. ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ముందుగా విద్య నేర్పిన గురువులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి మెమొంటోలను అందజేశారు.


గురువులతో పూర్వ విద్యార్థులు


సరుకులు అందుకున్న వృద్ధురాలు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మిషన్ అన్నపూర్ణ సహాయనిధి సంస్థ ద్వారా ఆదివారం 3 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాదు నివాసి బొగ్గవరపు సత్యవతి తన తండ్రి ఆత్మూరి బాల జ్ఞాపకార్థం అందించిన ఆర్థిక సహకారంతో 3 కుటుంబాలకు సరుకులు అందించినట్లు తెలిపారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రంజాన్ ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

రంజాన్ పండుగను ముస్లిం కుటుంబాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. పట్టణ పరిధిలో ఉన్న మసీదులు ముస్లింలతో కిటకిటలాడాయి. నెల వంక శనివారం కనిపించడంతో నెల రోజులపాటు జరిగే ఉపవాస దీక్షలో పాల్గొన్నారు. పట్టణంలోని కోటబజార్‌లోని రెండు మసీదుల్లో, పెన్షన్ లైన్ లోనే రెండు మసీదుల్లో ఈ ఉపవాస ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఇతర అన్ని మసీదుల్లోనూ రంజాన్ ప్రార్థనలు ప్రారంభమవగా ముస్లిం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మాజీ ఎంపిటిసి కుటుంబికులను పరామర్శిస్తున్న ముద్రగడ

మాజీ ఎంపిటిసికి ముద్రగడ పరామర్శ

ప్రజాశక్తి - కిర్లంపూడి

అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపిటిసి పాముల వరలక్ష్మిని వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె భర్త పాముల భద్రం, ఇతర కుటుంబ సభ్యులు వీరబాబు, చంటిలతో ఆయన మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, చల్లా సత్యనారాయణ, శరకణం భద్రం, నక్కా అప్పలరాజు , మళ్ళ నాగు, యల్లపు నానాజీ, శరకణం సంతోష్ పాల్గొన్నారు.

కొత్తూరులో పర్యటించిన అధికారులు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె.కొత్తూరు గ్రామాన్ని ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి సూర్య భాస్కరరావు పర్యటించారు. గ్రామంలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై వారు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు సాయంత్రం సమయంలో తాగునీరు సరఫరా కావడం లేదని వివరించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్‌ను ఆదేశించారు.

రాజ్యాంగంపై అవగహన అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట


భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఒమ్మి రఘురామ్ అన్నారు. ఆదివారం జగ్గంపేట బాలికల వసతి గృహంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు అని అన్నారు. రాజ్యాంగాన్ని మించిన గొప్ప ధర్మశాస్త్రం లేదని, ఏ మతం వారు ఆయా మత గ్రంథాలను ఆచరించక పోయినా పర్వాలేదు కానీ, భారత రాజ్యాంగాన్ని మాత్రం అందరూ ఆచరించాలని న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ప్రసంగి ఆదినారాయణ, రాష్ట్ర సాహిత్య విభాగం కార్యదర్శి సన్యాసిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాకృష్ణ చేతుల మీదుగా ప్రచార రథాన్ని అందించిన కడియాల నాగరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీలపల్లి అప్పారావు, కర్రి నారాయణమూర్తి, కొట్టు శివరామకృష్ణ, నరాలశెట్టి నరసయ్య, గున్నాబత్తుల అనుషా, బొడ్డేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వ్యాపారాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని హోం ట్రయాంగల్ డేటా మేనేజర్ ఇందూకుమారి అన్నారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో మెప్మా, ఎన్ఎస్‌డిసి సంయుక్త ఆధ్వర్యంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి గంగ అధ్యక్షతన వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్తు, గృహపకరణాల కార్మికులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందూ కుమారి మాట్లాడుతూ ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ పొందిన కార్మికులకు 8 రోజుల్లో 60 గంటలు శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం వారికి రూ.4 వేలు విలువ చేసే పరికరాల టూల్ కిట్, ఐడి కార్డ్, టీ షర్ట్, సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. యాప్‌లో రిజిస్ట్రేషన్ కోసం కార్మికులు చెల్లించవలసిన వెయ్యి రూపాయలు కార్మికుని తరఫున హోం ట్రయాంగిల్ సంస్థ చెల్లిస్తుందన్నారు. వినియోగదారుల అవసరాల నిమిత్తం ఈ యాప్ ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించబడుతుందన్నారు. ప్రతి కార్మికుడు ఆదనపు ఆదాయం పొందవచ్చన్నారు. దీనిని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలు మెప్మా పిడి ప్రియంవద, సిఎంఎం భ్రమరాంబ, రీజనల్ మేనేజర్ ఎంవి.ప్రసాద్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

యానాంలో రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అయ్యాయి. స్థానిక జామియా మసీదు, వెంకటరత్నం నగర్లో మజీద్ ఏ కూబాల్లో నియోజకవర్గ పరిధిలో ముస్లింలు పవిత్ర ప్రార్థనలు నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ ఉపవాసదీక్షలు రంజాన్ ముందురోజుతో ముగుస్తాయి. ఈ సందర్భంగా ఇమామ్లు మహ్మద్ రఫీ, ఎండి యజ్ఞానీలు రంజాన్ మాస విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాది తాజుద్దీన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జిద్ అధ్యక్షులు ఎస్‌కెఎం.జిలానీ, ఉపాధ్యక్షుడు ఎండి కరీమ్, ట్రెజరర్ జిలాని, కార్యదర్శి రిజ్వాన్, సహాయకార్యదర్శి గౌస్ మొహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకూ పశువైద్య సేవలు

ప్రజాశక్తి - పెద్దాపురం



ఈ నెల 30వ తేదీ వరకూ గ్రామాల్లో పశు వైద్య సేవలు కొనసాగుతాయని పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ టిఎ టిఎ.రామస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరు వరకూ జరిగే పశు వైద్య శిబిరాల్లో పశువులకు గాలికుంటు, బ్రూ సెల్లోసిస్ వ్యాధుల నిరోధక టీకాలు వేయడం జరుగుతుం దన్నారు. ఈ వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యం పూర్తిగా అరికట్టవచ్చన్నారు. దూడల్లో మరణాలు తగ్గించి ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడు తుందన్నారు. పశుపోషకుని ఇంటి వద్దనే ఏడాదికి 3 విడతలుగా పశువులకు బ్రూ సెల్లోసిస్ టీకాలు వేస్తారన్నారు. 4 నుంచి 8 నెలల మధ్య వయసు కలిగిన పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. పశు వైద్యాధికారులు డాక్టర్ కె.రాకేష్, డాక్టర్ ఎ.మస్తాన్ బి, డాక్టర్ ఎం.గంగాభవాని, డాక్టర్ పి.అన్నపూర్ణనాయుడు ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ కమిటీకి విరాళం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో పాండవుల పాలెంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొని ఆలయ కమిటీ సభ్యులకు రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కర్రి నాగేశ్వరరావు, చామరి శ్రీను, సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, మేకా చంటిబాబు పాల్గొన్నారు.